విశాఖపట్టణం
బుధవారం 7 అక్టోబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 236 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# శరవేగంగా అమరావతి



ప్రతి నెలా రూ. 2 వేల కోట్ల పనులు పూర్తి లక్ష్యం

రాజధానిలో ప్రస్తుతం 152 ప్రాజెక్టులు

సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

అమరావతి పనులపై కీలక సమీక్ష

2



అపాయింట్‌మెంట్ లేకుండా

# కలవలేరు

మమ్మల్ని కలవాలని ఏ పార్టీ కోరలేదు

కలిసేందుకు నిర్దిష్టమైన విధానం ఉంది

రాహుల్ గాంధీ నేతృత్వ నిరసనపై ఈసీ వ్యాఖ్యలు

ఇరు పక్షాలు ఆమోదిస్తేనే సమావేశం సాధ్యం

(ప్రత్యేకప్రతినిధి - జయజయహే)

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఎంపీలు ఎన్నికల సంఘాన్ని కలవాలని చేసిన ప్రయత్నంపై ఎన్నికల సంఘం స్పందించింది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ కూడా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరలేదని, ఆ తర్వాత వచ్చిన సమావేశ ప్రతిపాదనను నిబంధనలకు విరుద్ధంగా భావించి ఆమోదించలేదని తెలిపింది. ఉదయం కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం వైపు పాదయాత్ర చేపట్టాయని ..మిగతా 2లో

ఎవరికి ఎక్కడ బలం ఉంటే

# వాళ్లే పోటీ

చంద్రబాబుతో పవన్ భేటీలో నిర్ణయం

స్థానికంపై కసరత్తు మొదలుపెట్టిన కూటమి





(అమరావతి - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ కూటమి నేతల్లో సీట్ల పంపకాలు, పోటీ చేసే స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఉదయం 9.45 గంటలకు ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో భేటీ కాగా, రెండు గంటలపాటు పలు అంశాలపై చర్చించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ భేటీలో పాల్గొనలేదు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వైజాగ్ పర్యటన కారణం గా అటెండ్ కాలేక పోతున్నారని పార్టీ నేతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటుపై ఇప్పటికే మాధవ్, చంద్రబాబు మధ్య సమావేశం జరిగినట్లు వెల్లడించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య స్థానాల సర్దుబాటుపై చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఏ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుంది, ఎలాంటి వ్యూహాలు అను-సరించాలనే దానిపై చర్చలు జరిపారు. అలాగే కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థుల ఎంపికపై, ఈ ఎన్నికల్లో కూటమి అనుసరించాల్సిన వ్యూహాలపై సైతం చర్చ జరిగింది. సీఎం చంద్రబాబుతో సమావేశం కావడానికి ఉండవల్లి నివాసానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆత్మీయ స్వాగతం పలికారు. కారు వద్దకు వచ్చిన లోకేష్

# సెంచరీ దిశగా కిలో బియ్యం..!

నిన్నటి వరకు రూ. 45 నుంచి రూ. 50 మధ్య

నేడు రూ. 80 దాటి రూ. 90 వరకు

త్వరలోనే సెంచరి క్రాస్ చేసే ఛాన్స్

సామాన్యులపై దారుణ భారం

(అమరావతి - జయజయహే)

మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా తయారైంది సామాన్యుడి పరిస్థితి. ఇప్పటికే పప్పులు, నూనెలు, ఉప్పు వంటి నిత్యావసరాల ధరలు భారం మోపుతుండగా.. ఇప్పుడు బియ్యం ధరలు కూడా షాకిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు కిలో రూ.45 నుంచి రూ.50 మధ్య ఉన్న సన్న బియ్యం ధరలు ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90 వరకు చేరడం వంటింటి బడ్జెట్‌ను బెంబేలెత్తిస్తోంది. తెలంగాణలో సన్నాల సాగు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ బియ్యం ధరలు మాత్రం తగ్గకపోవడం వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. అసలు ఈ ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? ఇది సహజమైన పెరుగుదలా? వ్యాపారుల నిల్వల ప్రభావమా? ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావమా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. మరీ ముఖ్యంగా గత రెండు నెలల్లో బియ్యం ధరలు ఒక్కసారిగా పెరగడం సామాన్యులను షాక్‌కు గురిచేస్తోంది. గత ఏడాది గరిష్టంగా కిలో రూ.60 వరకు ఉన్న ..మిగతా 2లో





# స్త్రీ శక్తి.. సూపర్ హిట్

వంద కోట్లు దాటిన ప్రయాణీకుల సంఖ్య

మహిళలకు రూ. 3,500 కోట్లు ఆదా

2



బీసీ రిజర్వేషన్ల

# సాధనే లక్ష్యం

రాజీలేని పోరాటం చేస్తాం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధిస్తాం

సామాజిక న్యాయమే ప్రభుత్వ ధ్యేయం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్న, కొలుసు, అనగాని స్పష్టీకరణ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని స్పష్టం చేస్తూ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, ..మిగతా 2లో

వాయుసేన చీఫ్‌గా

# అశుతోష్ దీక్షిత్

వైమానిక దళంలో నాలుగు దశాబ్దాలుగా సేవలు

అక్టోబర్ 31 బాధ్యతలు స్వీకరణ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



భారత వాయుసేనకు తదుపరి అధిపతిగా ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా సేవలందిస్తున్న ఆయన, వాయుసేన 29వ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అక్టోబర్ 31 ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజున నూతన ఎయిర్ చీఫ్‌గా ఆశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టనున్నారు.

**దాదాపు 40 ఏళ్ల సేవ**

ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ వాయుసేనలో దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం కలిగిన సీనియర్ ఫైటర్ పైలట్. 1966 డిసెంబర్ 9న జన్మించిన దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వాయుసేన ఫైటర్ స్ట్రీమ్‌లో చేరారు. అప్పటి నుంచి వివిధ కీలక హోదాల్లో సేవలందించిన ఆయనకు ఆపరేషనల్, శిక్షణ, విధాన రూపకల్పన, విమాన పరీక్షలు, వ్యూహాత్మక ప్రణాళిక వంటి విభాగాల్లో విస్తృత అనుభవం ఉంది. ఆయన ప్రయాణంలో ఫైటర్ పైలట్‌గా మాత్రమే కాకుండా ప్రయోగాత్మక టెస్ట్ పైలట్, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. భారత వాయుసేనలోని పలు కీలక యుద్ధ, శిక్షణ విమానాలను నడిపిన అనుభవం కూడా ఉంది. మిరాజ్-2000, వివిధ మిగ్ సిరీస్ విమానాలు, కిరణ్, జాగ్వార్, ఐఎల్-78, హాక్‌తో పాటు స్వదేశీ తేజస్‌లోనూ ఆయన ప్రయాణించారు. ప్రయోగాత్మక టెస్ట్ పైలట్‌గా పనిచేసిన అనుభవం, భవిష్యత్ విమాన సాంకేతికత, యుద్ధ సామర్థ్యాలపై ఆయనకు ప్రత్యేక అవగాహనను కల్పించింది.

ఐరాసలో గళమెత్తిన

# అరకు ఎంపీ




3

For a pure tomorrow.. జయహో

# అపాయింట్‌మెంట్ లేకుండా కలవలేరు

**మొదటి పేజీ తరువాయి...**

ఆ సందర్భంగా కొంతమంది ఎంపీలు తమ ప్రతినిధి బృందాలతో కమిషన్‌ను కలవాలనుకుంటున్నట్లు మీడియా ద్వారా తెలిసిందని ఎన్నికల సంఘం పేర్కొంది. అయితే సాయంత్రం 4 గంటల వరకు ఏ పార్టీ ప్రతినిధులు అపాయింట్‌మెంట్ కోరలేదని స్పష్టం చేసింది. సాయంత్రం 4 గంటల తర్వాత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఎంపీల బృందం కమిషన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలనుకుంటున్నట్లు ఢిల్లీ పోలీసుల నుంచి సమాచారం అందిందని ఎన్నికల సంఘం తెలిపింది. రాజకీయ పార్టీలతో సమావేశాల కోసం 2025లో ఒక విధానాన్ని ఏర్పాటు చేసినట్లు, దానిని అన్ని పార్టీలకు తెలియజేసినట్లు ఎన్నికల సంఘం గుర్తు చేసింది. ఏ పార్టీ ప్రతినిధి బృందమైనా, లేదా పలు పార్టీల ఉమ్మడి బృందమైనా కమిషన్‌ను కలవాలనుకుంటే అధికారిక ప్రతినిధి ద్వారా అపాయింట్‌మెంట్ కోరాలని, ఆ తర్వాత ఇరు పక్షాలు అంగీకరించిన సమయంలోనే సమావేశం జరుగుతుందని వివరించింది. సాయంత్రం 4 గంటల తర్వాత ఢిల్లీ పోలీసుల ప్రతిపాదనలో సమావేశం 240 మంది ఎంపీల బృందంతో జరగనున్నట్లు, ప్రతిపాదిత వేదిక పార్లమెంట్ హౌస్ అనెక్స్ అని ఢిల్లీ పోలీస్ డీసీపీ తెలియజేశారని సంఘం వెల్లడించింది. నియమావళి ప్రకారం ఇలాంటి సమావేశాలు ఎన్నికల సంఘం ప్రాంగణంలోనే జరగాలి కాబట్టి ఆ అభ్యర్థనను ఆమోదించలేదని ఎన్నికల సంఘం తెలిపింది. వినతిపత్రాన్ని స్వీకరించేందుకు కమిషన్‌లోని అత్యంత





సీనియర్ అధికారిని సమావేశ వేదికకు పంపేందుకు సిద్ధమైనా ఆ ప్రతిపాదనను కూడా ఎంపీలు తిరస్కరించారని చెప్పింది. దేశ పార్లమెంటరీ, ప్రజాస్వామ్య ప్రక్రియలను, తమ నియమనిబంధనలను, సంప్రదాయాలను గౌరవిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఏ రాజకీయ పార్టీ అయినా ఎప్పుడైనా సమావేశం కోసం అభ్యర్థించవచ్చని, సౌకర్యాలను బట్టి సమావేశం ఏర్పాటు చేయవచ్చని, ఇది సహజమైన ప్రక్రియ అని పేర్కొంది. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘానికి విపక్ష ఎంపీల సేవ్ డెమోక్రసీ మార్చ్ మంగళవారం ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ చేపట్టారు. ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు మార్చ్‌ను అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో ధర్నాకు దిగారు. ఆ తర్వాత ధర్నా చేసిన నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. సుమారు 300 మంది ఎంపీలు కమిషనర్లను కలవాలనుకుంటే పోలీసులు ఆపారని, తాము కోట్లాది మంది ప్రజల ప్రతినిధులమని, ఎన్నికల కమిషనర్లు ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. కమిషన్ కార్యాలయం కొద్ది దూరంలోనే ఉన్నా తమను అనుమతించలేదని ఆరోపించారు.



# శరవేగంగా అమరావతి

## ప్రతి నెలా రూ. 2 వేల కోట్ల పనులు పూర్తి లక్ష్యం
## రాజధానిలో ప్రస్తుతం 152 ప్రాజెక్టులు
## సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
## అమరావతి పనులపై కీలక సమీక్ష

(అమరావతి - జయజయహే)

రాజధాని అమరావతి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అమరావతి పనులపై మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ, పనులు చేస్తోన్న వివిధ ఏజెన్సీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. గడిచిన నెలలో రాజధానిలో రూ.1,345 కోట్ల విలువైన పనులను నిర్మాణ సంస్థలు చేశాయని వెల్లడించారు. ప్రతి నెలా రూ.2 వేల కోట్ల మేర పనులు పూర్తయ్యేలా లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం రాజధానిలో 152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. అవుటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ఆయా నిర్మాణ సంస్థలు చేపట్టిన పనులను పురోగతిని సీఎం చంద్రబాబు సమీక్షించి పలు సూచనలు చేశారు.



# స్త్రీ శక్తి.. సూపర్ హిట్

## వంద కోట్లు దాటిన ప్రయాణీకుల సంఖ్య
## మహిళలకు రూ. 3,500 కోట్లు ఆదా

(అమరావతి - జయజయహే)

ఆర్టీసీ బస్సు కనిపిస్తే చాలు.. టికెట్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు.. చేతిలో గుర్తింపు కార్డు ఉంటే సరిపోతుంది. గమ్యం ఎక్కడైనా సరే.. నిర్దేశించిన సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న స్త్రీ శక్తి పథకం ఇప్పుడు మరో కీలక మైలురాయిని చేరుకుంది. మహిళలకు ప్రజా రవాణాను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో 2025 ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ వెల్లడించింది. తాజాగా ఈ ఉచిత ప్రయాణాల సంఖ్య 100 కోట్లను దాటింది. వంద కోట్ల ఉచిత ప్రయాణాలంటే.. మహిళల కుటుంబాలకు ప్రయాణ ఖర్చులో భారీ ఉపశమనం అన్నమాట. ఏపీఎస్ఆర్టీసీ లెక్కల ప్రకారం.. ఈ ప్రయాణాల ద్వారా మహిళలకు సుమారు రూ.3,500 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలిగింది.



# ఎవరికి ఎక్కడ బలం ఉంటే వాళ్లే పోటీ

**మొదటి పేజీ తరువాయి...**

పవన్ కళ్యాణ్‌ను హత్తుకుని, కరచాలనం చేసి, ఆప్యాయంగా ఇంట్లోకి తీసుకెళ్లారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం భేటీ అయ్యారు.

### బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చ

ఏపీ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. కానీ ఈ అంశం సుప్రీంకోర్టులో ఉన్నందున, దీనిపై ఎలా ముందుకెళ్లాలి, ప్రస్తుతానికి ఏమీ తేలకపోతే పార్టీ పరంగానైనా రిజర్వేషన్లు ఇవ్వాలా అని చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం కూటమి సమన్వయ కమిటీలోని టీడీపీ నుంచి మంత్రి నిమ్మల రామానాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఇప్పటివరకు మూడుసార్లు జరిగిన కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలు, అభ్యర్థుల ఎంపికపై జరుగుతున్న కసరత్తు వంటి అంశాల్ని వారు పార్టీ అధినేత చంద్రబాబుకు వివరించారు. కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లో గెలిచేలా కృషి చేయాలని పార్టీ నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి పొత్తులో భాగంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీసుకునే నిర్ణయాలకు పార్టీ నేతలు, కార్యకర్తలు కట్టుబడి ఉండాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఇదివరకే పలుమార్లు సూచించారు. తాము సంస్థాగతంగా అంత పటిష్టంగా లేము అని, పార్టీని మరింత బలోపేతం చేసుకుంటూ, కూటమి పెద్దల నిర్ణయాలకు అనుగుణంగా ఎన్నికల్లో పోటీ చేసి విజయాలు సాధించాలని పలుమార్లు పేర్కొన్నారు.



# సెంచరీ దిశగా కిలో బియ్యం..!

**మొదటి పేజీ తరువాయి...**

బియ్యం ధర ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90కు చేరింది. గత కొన్నేళ్ల ధరలను పరిశీలిస్తే.. 2020లో కిలో బియ్యం రూ.35 నుంచి రూ.42, 2021లో రూ.38 నుంచి రూ.44, 2022లో రూ.40 నుంచి రూ.46, 2023లో రూ.42 నుంచి రూ.50, 2024లో రూ.45 నుంచి రూ.55, 2025లో రూ.50 నుంచి రూ.70 వరకు పలికింది. అయితే 2026లో మాత్రం కిలో ధర ఏకంగా రూ.80 నుంచి రూ.90కు చేరింది. అంటే గతంలో ఏడాదికి రూ.5 నుంచి రూ.10 వరకు పెరుగుతూ వచ్చిన ధర.. ఈ ఏడాది ఏకంగా రూ.20 నుంచి రూ.25 వరకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

### ఎల్‌నినో ప్రభావం.. ముందస్తు నిల్వలే కారణమా?

బియ్యం ధరల పెరుగుదలకు వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కూడా ఒక కారణంగా వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. రానున్న పంట దిగుబడిపై అనిశ్చితి ఉంటుందన్న అంచనాలతో హోల్‌సేల్ వ్యాపారులు, ప్యాకింగ్ కంపెనీలు సన్న బియ్యాన్ని ముందుగానే పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ముందస్తు కొనుగోళ్ల కారణంగా మార్కెట్‌లో లభ్యత తగ్గి ధరలు పెరుగుతున్నాయన్న వాదన వినిపిస్తోంది. మరోవైపు ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ కింద సేకరించిన ధాన్యంలో అక్రమాలు జరగడం, నాణ్యమైన బియ్యం పక్కదారి పట్టడం వంటి అంశాలు కూడా మార్కెట్‌లో బియ్యం లభ్యతపై ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణ సోనా, హెచ్ఎంటీ, బీపీటీ వంటి నాణ్యమైన సన్న రకాలకు ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు తెలంగాణలోని నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం వంటి జిల్లాలకు వచ్చి రైతుల నుంచి అధిక ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేసి ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు తరలిస్తున్నారనే వాదన ఉంది. దీంతో రాష్ట్రంలోని స్థానిక మార్కెట్లలో సన్న ధాన్యం లభ్యత తగ్గి, చివరకు బియ్యం ధరలపై ప్రభావం పడుతోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

### ప్రభుత్వ బోనస్‌తో ఓపెన్ మార్కెట్‌కు తగ్గిన సరఫరా?

తెలంగాణ ప్రభుత్వం సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోంది. అలాగే పాఠశాలలు, రేషన్ షాపులకు సన్న బియ్యం సేకరిస్తోంది. దీంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఎక్కువగా విక్రయిస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ.. ప్రైవేట్ మిల్లర్లు, ఓపెన్ మార్కెట్ వ్యాపారులకు అందుబాటులో ఉండే సన్న ధాన్యం పరిమాణం తగ్గుతోంది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధర క్వింటాకు సుమారు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ధాన్యం ధర పెరగడంతో పాటు రవాణా, మిల్లింగ్, ప్యాకింగ్, విద్యుత్ వంటి ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. ఇవన్నీ కలిసివచ్చి చివరకు వినియోగదారుడిపై భారం పడుతోంది. కిలో బియ్యం రూ.80 నుంచి రూ.90 వరకు చేరడంతో నెలవారీ కుటుంబ బడ్జెట్‌లో బియ్యం కోసం కేటాయించాల్సిన మొత్తం గణనీయంగా పెరిగింది. పప్పులు, ఉప్పు వంటి ఇతర వస్తువుల ధరలు పెరిగితే కొంత మేర సర్దుబాటు చేసుకోవచ్చని.. కానీ బియ్యం ధర పెరిగితే మాత్రం తప్పనిసరిగా కొనాల్సిందేనని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బియ్యం ధర సెంచరీ కొడుతుందా?

ప్రస్తుతం కిలో బియ్యం ధర రూ.80 నుంచి రూ.90 మధ్య ఉండటంతో.. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే ధర రూ.100 మార్క్‌ను తాకే అవకాశాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. బియ్యం వంటి నిత్యావసర వస్తువు ధర సామాన్యులపై మరింత భారం పడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు. అక్రమ నిల్వలు, పక్కరాష్ట్రాలకు తరలింపులు, మార్కెట్‌లో కృత్రిమ కొరత వంటి అంశాలపై దృష్టి పెట్టడంతో పాటు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. ధర ఉడుకుతోంది.. బియ్యం రేటు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను కాల్చేస్తోంది.

# బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్.. న్యూఢిల్లీలోని ఏపీ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా వారు ఉద్ఘాటించారు. సుప్రీంకోర్టు ద్వారా న్యాయం సాధించేందుకు ప్రభుత్వం పోరాటం చేస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని అధిగమించేందుకు తగిన ఎంపైరికల్ డేటాతో సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటి ఆధారంగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బీసీల మీద కొందరికి ఉన్న రాజకీయ, వ్యక్తిగత కక్ష కారణంగానే వారికి దక్కాల్సిన అవకాశాలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించడం, వారికి రాజకీయంగా, సామాజికంగా ఎప్పుడూ అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన సిద్ధాంతమని ఆయన స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్లు సక్రమంగా అమలులోకి వస్తే సుమారు 16,800 పోస్టులు బీసీలకు దక్కుతాయని ఆయన తెలిపారు. పంచాయతీ సర్పంచ్‌ల నుంచి మొదలుకుని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మేయర్‌లుగా ఎదిగి, భవిష్యత్తులో చట్టసభలకు, అసెంబ్లీలు, పార్లమెంట్‌కు వెళ్లే గొప్ప అవకాశాలు వీరికి లభిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బలహీన వర్గాల రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, తదుపరి న్యాయ పోరాట వ్యూహాలపై చర్చించేందుకు ముగ్గురు మంత్రుల బృందం ఢిల్లీకి వచ్చిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఢిల్లీలో సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్లతో సమావేశమైన మంత్రుల బృందం, న్యాయ నిపుణుల సలహాలు, సుప్రీంకోర్టు తీర్పులు వివిధ కమిషన్‌ల రిపోర్టుల ఆధారంగా భవిష్యత్తు విధివిధానాలపై ప్రముఖ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, దేవదత్ కామత్ చర్చించినట్లు వెల్లడించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుదీర్ఘకాలం పాటు బలహీన వర్గాలను కేవలం ఓట్ల యంత్రాలుగానే చూశారని, ఆ పరిస్థితులను మార్చడానికి ఎన్.టి.రామారావు ఆ వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించారని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం పెంచేందుకు 1987లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తొలిసారిగా స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, ఆ తర్వాత 1995లో చంద్రబాబు నాయుడు దానిని 34 శాతానికి పెంచారని ఆయన వివరించారు. అయితే గత ప్రభుత్వం ఎలాంటి చట్ట సవరణ చేయకుండా.. కనీసం సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా బలహీన వర్గాల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని మంత్రి వ్యాఖ్యానించారు. బలహీన వర్గాలకు ఇచ్చిన మాట ప్రకారం, ఏ పరిస్థితుల్లోనైనా 34 శాతం రిజర్వేషన్లు దక్కేలా చివరి నిమిషం వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. ఇందుకోసం సుప్రీంకోర్టులో తగిన కేసులు వేసి నిపుణుల సలహాలతో ముందుకు వెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రంలో బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడంతోపాటు వారికి రాజకీయ, ప్రజాస్వామ్య సాధికారత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. బలహీన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు సాధించాలనే పట్టుదలతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. బలహీన వర్గాలకు కేవలం ఏదో రిజర్వేషన్ ఇవ్వాలనే కాకుండా, రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గతంలో ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించారని ఆయన గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర శాసనసభకు ఉన్న అధికారాలు, 243డి, 243టి సెక్షన్ల ప్రకారం బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. స్థానిక సంస్థల్లోనూ బలహీన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం దక్కాలనే ఉద్దేశంతోనే ఈ ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ రాష్ట్రం బాగుండాలని కోరుకుంటారని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ప్రపంచం మెచ్చిన నాయకుడైన ఆయన ఎన్నో రాజకీయ ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షిస్తారన్నారు.

# స్త్రీ శక్తికి విశేష ఆదరణ

- స్త్రీ శక్తి తో కూటమి విజయానికి మహిళలే సాక్ష్యం
- రూ. 100 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి
- భారం కాదు బాధ్యతతో స్త్రీ శక్తి పథకం కొనసాగుతుంది
- రవాణా మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి

**అమరావతి, అక్టోబర్ 6, జయ జయహే**



రాష్ట్రంలో మహిళల కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతూ 100 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని అధిగమించడం పట్ల రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. గతేడాది ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదుకావడం పథకం విజయానికి నిదర్శనమన్నారు. ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని, ఇప్పటివరకు మహిళలకు సుమారు రూ.3,550 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలిగిందని మంత్రి పేర్కొన్నారు. మహిళలపై కుటుంబ ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గిస్తూ, వారి అవసరాలకు ఆర్థిక స్వేచ్ఛను కల్పించడంలో ఈ పథకం కీలకంగా మారిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం హామీలుగా కాకుండా బాధ్యతగా భావించి అమలు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మంత్రి స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా కొంత భారాన్ని భరిస్తున్నప్పటికీ, మహిళల సంక్షేమం విషయంలో వెనుకడుగు వేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆర్టీసీపై నెలకు సుమారు రూ.160 కోట్ల మేర భారం పడుతున్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం రూ.2,160 కోట్లను ఆర్టీసీకి చెల్లించడం ద్వారా పథకం అమలుకు పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రభుత్వానికి భారంగా భావించకుండా, మహిళల సంక్షేమం కోసం బాధ్యతగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.




## 100 కోట్ల మార్కు దాటేసిన స్త్రీ శక్తి

**ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ "రెడ్డి నారాయణరావు"**

**పెందుర్తి, అక్టోబర్ 6, జయ జయహే**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం 'స్త్రీ శక్తి' ఒక అరుదైన, చారిత్రాత్మక రికార్డును నెలకొల్పింది అని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ "రెడ్డి నారాయణరావు" అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 ఆగస్టు 15న ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మహిళలు ఏకంగా 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ యంత్రాంగం అధికారికంగా ప్రకటించిందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారని , ఆడబిడ్డల ప్రయాణ భారాన్ని తగ్గించడమే కాకుండా ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన ఈ పథకం విజయం పట్ల తీవ్ర సంతోషం వ్యక్తం చేస్తూ ాజూంతీఎ డ్రైవర్లు , కండక్టర్ లకు రెడ్డి నారాయణరావు ప్రత్యేక మైన అభినందనలు తెలిపారు.

## ఐరాసలో గళమెత్తిన అరకు ఎంపీ

**జయజయహే**

అంతర్జాతీయ వేదికపై తెలుగు మహిళ, అ గళాన్ని వినిపించారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ సభ 81వ సెషన్‌లో భాగంగా జరిగిన పరిపాలన, బడ్జెట్ కమిటీ (ఐదవ కమిటీ) మొదటి అధికారిక సమావేశంలో ఆమె భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రసంగించారు. ఈ కీలక సమావేశంలో ఆమె ఐరాస పనితీరు, ఆర్థిక స్థిరత్వం, సంస్కరణల ఆవశ్యకతపై భారత వాదనలను బలంగా వినిపించారు.తనుజారాణి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితిలో సంస్కరణల ప్రక్రియను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. ఐరాస ఆర్థికంగా బలంగా ఉండాలంటే సభ్య దేశాలన్నీ తమ వాటాలను ఎలాంటి షరతులు లేకుండా, సకాలంలో, పూర్తిస్థాయిలో చెల్లించాలని ఆమె స్పష్టం చేశారు. కొన్ని దేశాలు నిధులను నిలిపివేయడం లేదా ఆలస్యం చేయడం వల్ల సంస్థ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, దీనిని అధిగమించాల్సిన అవసరం ఉందని సూచించారు.ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమాలకు తగినన్ని ఆర్థిక వనరులను సమకూర్చడం చాలా ముఖ్యమని తనుజారాణి అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి 'యూఎన్80 ఇనిషియేటివ్' వంటి కార్యక్రమాలను సమర్థంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. కమిటీలో ఎలాంటి నిర్ణయమైనా సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం ద్వారా జరగడం ఉత్తమమని, ఇది సంస్థ సమర్థతను పెంచుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే, ఐరాస పరిధిలోని ప్రత్యేక విభాగాలు, సలహా కమిటీల పాత్రలను గౌరవించాలని, వాటి పనిలో జోక్యం చేసుకోకూడదని సూచించారు.ప్రస్తుతం జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సమావేశాలకు హాజరైన 15 నుంచి 18 మంది సభ్యులు గల భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో తనుజారాణి కూడా ఒకరు. దేశంలోని భిన్న రాజకీయ, భౌగోళిక వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా ఈ బృందాన్ని ఎంపిక చేశారు. అరకు వంటి ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఒక గిరిజన మహిళ ఐరాస వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించడం గమనార్హం.



## ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు..

**రెవెన్యూ సిబ్బంది మౌనం?**

**గాంధీ పార్క్, ఐటీడీఏ షాపింగ్ మాల్ పరిసరాల్లో**

**ఆక్రమణలపై విచారణ చేపట్టాలని గిరిజనుల డిమాండ్**

**అరకులోయ, అక్టోబర్ 06: జయ జయహే.**



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేలి మండలం అరకులోయలోని మహాత్మా గాంధీ పార్క్ పరిసరాల్లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గాంధీ పార్క్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ ఐటీడీఏ షాపింగ్ మాల్ గోడను ఆనుకుని నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వ శాఖకు చెందిన శాఖ గ్రంథాలయం ప్రహరీ గోడను ఆనుకుని కూడా నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణాలపై పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి**

గాంధీ పార్క్, ఐటీడీఏ షాపింగ్ మాల్, శాఖ గ్రంథాలయం పరిసరాల్లో జరుగుతున్న నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించి, అక్రమ నిర్మాణాలు నిజమైతే తక్షణమే చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న

**తాడేపల్లి, అక్టోబర్ 6, జయ జయహే**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పెంద్ర వీరన్న మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆగస్టు 31న నిర్వహించిన సంచార జాతుల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, అలాగే సెప్టెంబర్ 27న రాజమహేంద్రవరంలో జరిగిన బీసీ గర్జన సభకు సంబంధించిన అంశాలను వీరన్న మాజీ సీఎం జగన్‌కు వివరించారు. సంచార జాతులు, బీసీ వర్గాలకు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై జగన్‌తో వీరన్న చర్చించారు. పార్టీ శ్రేణులు మరింత చురుకుగా పనిచేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జగన్ సూచించినట్లు వీరన్న తెలిపారు. పార్టీ అధినేత సూచనలను పాటిస్తూ బీసీ, ఎంబీసీ వర్గాలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పెంద్ర వీరన్న పేర్కొన్నారు.

# అనకాపల్లి వైద్య శాఖలో మల్లగుల్లాలు

**ఎవరికి వారే గప్‌చుప్.. బాధ్యులపై చర్యలకు వెనకడుగు.. వ్యవహారం కలెక్టర్ దృష్టికి వెళ్లకుండా లోపలే సర్దుబాటు యత్నాలా?**

**అనకాపల్లి, అక్టోబర్ 6, జయ జయహే:**

అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. కార్యాలయంలో ఏ ఒక్కరిని కదిలించినా అది ఎక్కడికి దారితీస్తుందోనన్న ఆందోళనతో సంబంధిత అధికారులు చర్యలకు వెనకడుగు వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తప్పిదాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన చోట మౌనం పాటిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ప్రభుత్వ డ్రైవర్‌ను ఒక ఎంపీహెచ్ఈఓ తన వ్యక్తిగత పనులకు వినియోగించుకున్నారన్న ఆరోపణలు తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగిని అధికారిక విధులకు కాకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించారన్న ఆరోపణలపై విచారణ జరిపి, వాస్తవాలు తేల్చాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ ఇప్పటివరకు




స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

"తప్పు చేసినా అండదండలు ఉంటే చర్యలు ఉండవా...?" అన్న ప్రశ్నలు సైతం ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ నిబంధనలు, మరోవైపు కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తున్నాయని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

సాధారణంగా జిల్లా స్థాయి కార్యాలయాల్లో పరిపాలనా వ్యవహారాలను చక్కదిద్దే మినిస్టీరియల్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తుంటారు. అయితే అనకాపల్లి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో క్షేత్రస్థాయిలో రోగులకు సేవలందించాల్సిన కొందరు ఉద్యోగులు దీర్ఘకాలంగా డెప్యూటేషన్‌పై కార్యాలయంలోనే కొనసాగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డెప్యూటేషన్ల వెనుక నిబంధనలు ఏమిటి... ఎవరి అనుమతితో కొనసాగిస్తున్నారు...? ఎంతకాలంగా ఇక్కడే పాతుకుపోయారు? అన్న అంశాలపై సమగ్ర పరిశీలన జరగాల్సిన అవసరం ఉందని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి. ఇదిలా ఉండగా, కార్యాలయంలోని వివిధ వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలు జిల్లా కలెక్టర్ దృష్టికి పూర్తిస్థాయిలో వెళ్తున్నాయా... లేక శాఖ స్థాయిలోనే వాటిని చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయా...అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, అవి నిరాధారమైతే వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ప్రభుత్వ వైద్య శాఖ అంటే ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అత్యంత కీలక వ్యవస్థ. అలాంటి శాఖలో పారదర్శకతపై అనుమానాలు తలెత్తే పరిస్థితి ఏర్పడితే అది కేవలం శాఖ ప్రతిష్ఠకే కాకుండా ప్రజల విశ్వాసానికీ సంబంధించిన అంశంగా మారుతుంది. అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని డెప్యూటేషన్లు, ఉద్యోగుల విధుల కేటాయింపు, ప్రభుత్వ వాహనాల వినియోగం తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఉద్యోగులు కోరుతున్నారు.





## టీడీపీలోకి భారీ చేరికలు

**కొయ్యూరు :(జయ జయహే న్యూస్ ),అక్టోబర్ 07,**

కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం పంచాయతీలో ఎంవివి ప్రసాద్, ఆధ్వర్యంలో జరిగిన పార్టీ చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అంబటి రాము తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎంవివి ప్రసాద్,దుచ్చరి చిట్టిబాబు ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, అంబటి రాము రాకతో రాజేంద్రపాలెం పంచాయతీలో టీడీపీ మరింత బలపడిందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా పాల్గొన్నారు.

## బీసీల రిజర్వేషన్లు తగ్గించిన ద్రోహి జగన్మోహన్ రెడ్డి

**టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య**

**గుంటూరు, అక్టోబర్ 6, జయ జయహే**



జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 24కు తగ్గించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనని టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి వల్లనే మళ్లీ బీసీలకు 34 రిజర్వేషన్లు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వెనుకబడిన వర్గాలకు ఆత్మాభిమానం, రాజ్యాధికారం కల్పించాలని సుప్రీంకోర్టులో టీడీపీ ధర్మపోరాటం చేస్తోందని వెల్లడించారు. కానీ ఈ బీసీ ద్రోహి జగన్మోహన్ రెడ్డి మాత్రం నేరుగా "ఎన్నికలు ఆపండి మహాప్రభో" అంటూ, పరోక్షంగా బీసీలకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అంటూ పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తూ, ఓ వైపు నిధులు ఆగేలా మరోవైపు బీసీల భవిష్యత్తును కాలరాసేందుకు ప్రయత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. బీసీల హక్కుల కోసం తెలుగుదేశం ప్రభుత్వం పోరాడుతుంటే, వ్యవస్థలను స్తంభింపజేసి ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని జగన్మోహన్ రెడ్డి ఆరాటపడటం దారుణమన్నారు. ఎన్నికలొస్తే ప్రజలు స్థానికంగా కూడా పాతరేస్తారన్న భయంతో, ఓటమి వణుకుతో కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

## రిఫార్మ్ ఉత్సవ్ వాయిదా

**నిర్వహణ తేదీ మళ్లీ ప్రకటిస్తాం.. మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**

**అమరావతి, అక్టోబరు 06 (జయ జయహే )**

కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన 'నేషనల్ మైనారిటీస్ డెవలప్‌మెంట్ అ ఫైనాన్స్ కార్పొరేషన్' (ఎన్.ఎం.డి.ఎఫ్.సి) ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన విజయవాడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలపై విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో తలపెట్టిన "రిఫార్మ్ ఉత్సవ్" కార్యక్రమం అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా వాయిదా పడినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన రాష్ట్రవ్యాప్త మైనారిటీ నోడల్ అధికారులు, నియోజకవర్గ యువతీ యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులందరూ ఈ మార్పును గమనించి, సానుకూలంగా పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి ఫరూక్ విజ్ఞప్తి చేశారు. రిఫార్మ్ ఉత్సవ్ కు సంబంధించిన తదుపరి నిర్వహణ తేదీ, వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ వాయిదా వల్ల కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

For a pure tomorrow..
జయహే

# ప్రజాస్వామ్యానికి పునాది విశ్వాసమే

**(ఫామ్-6 చర్చల నుంచి ఎన్నికల వ్యవస్థ పటిష్ఠత వరకు)**

**(ప్రతాప్)**

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందడానికి ప్రధాన కారణం కోట్లాది మంది పౌరులు ఎన్నికల ప్రక్రియపై ఉంచిన నమ్మకం. ఓటు హక్కు కేవలం రాజ్యాంగం కల్పించిన అధికారం మాత్రమే కాదు, పౌరుడు తన భవిష్యత్తును తీర్చిదిద్దుకునే శక్తివంతమైన సాధనం. అందుకే ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే, అది కేవలం ఒక సంస్థకు సంబంధించిన సమస్యగా కాకుండా ప్రజాస్వామ్యం మొత్తం ఎదుర్కొనే సవాలుగా మారుతుంది.

ఇటీవలి కాలంలో ఓటరు నమోదుకు సంబంధించిన ఫామ్-6 అంశంపై దేశవ్యాప్తంగా చర్చలు చోటుచేసుకున్నాయి. దానిపై న్యాయ, రాజకీయ, ప్రజా స్థాయిలలో ప్రశ్నలు తలెత్తాయి. ఇలాంటి సందర్భాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమే. వాస్తవానికి, ప్రజాస్వామ్యంలో ప్రశ్నలు అడిగే హక్కు ఎంత ముఖ్యమో, ఆ ప్రశ్నలకు పారదర్శకంగా సమాధానాలు ఇవ్వడం కూడా అంతే ముఖ్యం. సందేహాలను అణచివేయడం కంటే వాటిని స్పష్టీకరించడం ద్వారా వ్యవస్థలపై విశ్వాసం మరింత బలపడుతుంది.

ప్రజాస్వామ్యంలో విశ్వాసం అనేది ఒక రోజులో ఏర్పడేది కాదు. దశాబ్దాల పాటు నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడం, అధికార మార్పిడిని శాంతియుతంగా అమలు చేయడం, ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం ద్వారా అది నిర్మితమవుతుంది. భారత ఎన్నికల వ్యవస్థ ఈ విషయంలో విశేష ప్రగతిని సాధించింది. కోట్లాది మంది ఓటర్లు, లక్షలాది ఎన్నికల సిబ్బంది, వేలాది పోలింగ్ కేంద్రాల మధ్య ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడం ప్రపంచవ్యాప్తంగా అధ్యయనం చేసే అంశంగా నిలిచింది.

అయితే కాలం మారుతోంది. డిజిటల్ యుగంలో సమాచారం వేగంగా వ్యాపిస్తోంది. సోషల్ మీడియా ప్రభావంతో చిన్న సందేహం కూడా క్షణాల్లో జాతీయ చర్చగా మారుతోంది. అందువల్ల ఎన్నికల వ్యవస్థలు మరింత పారదర్శకత, సమాచార బహిరంగత, సాంకేతిక సామర్థ్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో రాజకీయ పార్టీలు, మీడియా, పౌర సమాజం కూడా వాస్తవాధారిత చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విమర్శలు ప్రజాస్వామ్యానికి అవసరం, కానీ విశ్వసనీయ సమాచారం ఆధారంగా జరిగితేనే అవి వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

నేటి యువతలో ఎన్నికలపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఓటరు విద్య మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఓటరు నమోదు ప్రక్రియ, జాబితా సవరణలు, అభ్యంతరాల పరిష్కార విధానం, ఎన్నికల నిర్వహణలో ఉపయోగించే సాంకేతిక వ్యవస్థల గురించి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉంది. సమాచారం ఎంత అందుబాటులో ఉంటే, అపోహలు అంత తక్కువగా ఉంటాయి. ప్రజల భాగస్వామ్యం పెరిగిన కొద్దీ ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం కూడా బలపడుతుంది.

ఫామ్-6 అంశంపై ప్రస్తుతం న్యాయ, పరిపాలనా స్థాయిలో పరిశీలన కొనసాగుతోంది. తుది నిర్ణయాలు, వాస్తవ పరిస్థితులు సంబంధిత రాజ్యాంగబద్ధ సంస్థలు మరియు న్యాయస్థానాల ప్రక్రియల ద్వారా స్పష్టమవుతాయి.

ఓటరు జాబితాలో ప్రతి పేరు వెనుక ఒక పౌరుడి హక్కు ఉంది. ప్రతి ఓటు వెనుక ఒక ఆశ ఉంది. ప్రతి ఎన్నిక వెనుక దేశ భవిష్యత్తు ఉంది. అందుకే ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడుకోవడం ఏ ఒక్క సంస్థ బాధ్యత కాదు; అది సమాజం మొత్తానికి సంబంధించిన బాధ్యత. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేది కేవలం బ్యాలెట్ బాక్స్ కాదు, ఆ బ్యాలెట్‌పై ప్రజలు ఉంచే నమ్మకం. ఆ నమ్మకాన్ని సంరక్షించడం, బలోపేతం చేయడం, తదుపరి తరాలకు అందించడం ప్రతి ప్రజాస్వామ్య దేశం ముందున్న అత్యంత పవిత్రమైన కర్తవ్యం. ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం ఎంత బలంగా ఉంటే, భారత ప్రజాస్వామ్యం అంత పటిష్ఠంగా, ప్రపంచానికి అంత ఆదర్శంగా నిలుస్తుంది..

# మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలు 2026

## వృద్ధాప్యంలో మానసిక ఆరోగ్యం అతి ముఖ్యం... నాలుగవ రోజు ప్రత్యేక శీర్షిక

## వృద్ధాప్యం అనుభవాల ఘని

**మానవ జీవనంలో అనేకానేక దశలలో ఆఖరి దశే వృద్ధాప్య దశ . బాల్యం యవ్వనం వృద్ధాప్యం అనేక దశలలో అత్యంత ముఖ్యమైన సున్నితమైన దశ వృద్ధాప్యం. నేడు మన దినచర్యలో అత్యంత వేగపూరితమైన పని ఒత్తిడిలో వృద్ధులతో సమయాన్ని ఎక్కువ గడప లేక పోతున్నాము. ఈ విధమైన జీవనశైలిని వారు అనుభవించలేక బయటకు వెళ్ళక లేక మనసులో తీవ్రమైన మనోవేదనకు గురై మానసిక అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు.**




చిన్న చిన్న విషయాలకు ఎక్కువగా ఆందోళన చెంది వారి యొక్క మనోవేదనతో కాలాన్ని గడుపుతున్నారు. వృద్ధుల యొక్క ఆలోచన వైఖరులు నేటి తరానికి చాదస్తముగా ఇబ్బంది పెట్టే విధంగా ఉండవచ్చునేమో కానీ వారి యొక్క అనుభవ పాఠాలు అత్యంత ముఖ్యమైనవి. వృద్ధుల యొక్క మనోభావం దెబ్బతినే విధంగా చుట్టుపక్కల పరిస్థితుల ప్రభావం ఎక్కువగా ఉంది నేటి తరంలో. ప్రస్తుత సమాజంలో ఉన్న జీవనశైలిలో దుస్తులు ధరించడం దగ్గర నుంచి మొబైల్ ఫోన్ల వాడకం వరకు వృద్ధుల యొక్క మనసు బాగా దెబ్బతినే పరిస్థితికి ప్రయాణమవుతున్నది. సొంత బిడ్డలు విదేశాలలో స్థిరపడడం వారిని మరింత మానసిక మనోవేదనకు దోహదపడేలా చేస్తుంది. స్వదేశాలలో ఉన్న పిల్లలు సక్రమంగా వృద్ధుల్ని చూడలేకపోవడం ఇది కూడా ఒక రకమైన కృంగుబాటు కు దారి తీసే తీవ్రమైన కారణం. సమాజంలో ఉన్న యువత అంతా కూడా మేల్కొని వృద్ధుల అనుభవాలను వారి యొక్క ప్రేమాభిమానాలను చూసుకుని వారికి సమయం కేటాయించి వారి యొక్క ఆలోచనలకు విలువలు ఇవ్వాలి.

### వృద్ధుల్లో ఒంటరితనానికి కారణాలు - మానసిక కృంగుబాటు

1. పిల్లలు ఎంతమంది ఉన్నా ఎంత ప్రేమగా పెంచి పెద్ద చేసిన చదువు ఉద్యోగం రీత్యా వారు దూరప్రాంతాలు అయినా విదేశాలలో స్థిరపడడం వలన ఒంటరితనానికి తీవ్రమైన మనోవేదనకు గురి అవుతున్నారు తల్లిదండ్రులు.
2. ఇంట్లో ఎవరూ లేకుండా వృద్ధులను ఒక్కరినే వదిలి వెళ్ళి పోవడం వలన ఒంటరిగా సమయాన్ని గడపలేకపోతున్నారు.
3. కుటుంబంలో ఎవరు వారి మాటకి ఎక్కువ సమయాన్ని స్థానాన్ని ఇవ్వలేకపోతున్నారు అని అనుకొని కృంగబాటుకు లోనవువుతున్నారు.
4. శారీరకంగా మానసికంగా అలసిపోవడం వలన ఎక్కువసేపు ప్రయాణాలు చేయలేక ఇంటికే పరిమితం అవుతున్నారు.
5. ప్రతిరోజు ఇంటిలోనే ఉండిపోవడం వలన బందిఖాన జీవనాన్ని గడుపుతున్నాము అనే భావనకు గురి అవుతున్నారు.
6. వృద్ధాప్య జంటలలో ఒకరు మరణిస్తే మరొకరు ఎందుకు బ్రతుకు అని ఆలోచన చేస్తూ కృంగిపోతున్నారు.
7. శరీరం సహకరించకపోవడం వలన అన్ని విషయాలలో చురుకుగా పాల్గొనలేము అని చింతిస్తూ చావే శరణ్యమని కాలాన్ని గడుపుతున్నారు.

### వృద్ధులు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునే లక్షణాలు

1. ప్రతిరోజు దినచర్యలో ఉదయాన్నే లేచి కొంతసేపు శరీరం సహకరించే వారికి నడక వ్యాయామం తప్పనిసరి.
2. యోగా ధ్యానం రోజు దినచర్యలో తప్పక చేయాలి.
3. భక్తి అనే విషయాన్ని ఎక్కువ సేపు ఆచరించే విధానం లో భగవద్గీత పది శ్లోకాలు తార్పర్యంతో చదువుకుంటూ జీవిత పరమార్ధాన్ని అర్థం చేసుకోవాలి.
4. ఎవరైనా చిన్ననాటి స్నేహితులు అందుబాటులో ఉంటే వారితో కొంత సమయం గడుపుతూ కష్టసుఖాలను పంచుకోవాలి.
5. ఆరోగ్యం పైన అధికంగా శ్రద్ధ చూపి మసాలా కారపు పదార్థాలు నూనె వస్తువులు అసలు తినకపోవడం చాలా శ్రేయస్కరం.
6. రాత్రులు ఖచ్చితంగా ఎక్కువ సేపు నిద్రపోవాలి.
7. టీవీలో ప్రసారమయ్యే సీరియల్ ఎక్కువ చూడటం వలన ఆందోళన పెరిగే ప్రమాదం ఉంది గనుక రోజుకి ఒక గంట మాత్రమే టీవీని చూడాలి.
8. ప్రార్థన రూపంలో నిద్రపోయే ముందు కృతజ్ఞతలు ప్రతిరోజు భగవంతుడికి చెప్పుకోవాలి.
9. ప్రకృతిలో ఉన్న మొక్కలను పువ్వులను చూస్తూ సాయంత్రం సమయం కాసేపు గడపాలి.
10. మనుమలు మనమరాళ్లతో ఆటలు ఆడుతూ కొంత సమయాన్ని వారికి నీతి కథలు బోధిస్తూ కొంత సమయాన్ని గడిపి తీరాలి.

### వృద్ధులతో కుటుంబ సభ్యులు ఎలా ఉండాలి

1. ప్రతిరోజు అమ్మానాన్నలను కనీసం ఫోన్లో అయినా ఎలా ఉన్నారు అని అడుగుతూ ఉండాలి.
2. వృద్ధులు ఎటువంటి విషయాలు చెప్పిన మనకి నచ్చకపోతే మృదువుగా తిరస్కరించి చెప్పే ప్రయత్నాలు చేయాలి కానీ కోపగించుకోకూడదు.
3. వృద్ధాప్యంలో ఉన్న దంపతుల పెళ్లిరోజులకి పండుగలకు జన్మదినాలకు ముఖ్యమైన పర్వదినాలలో వారికి ఖచ్చితంగా బట్టలను పెట్టి వారి యొక్క విలువైన దీవెనలు తీసుకోవడం చాలా శ్రేయస్సు.
4. కుటుంబంలో ఉన్న కొడుకు కోడలు కూతురు అల్లుడు మనవులు మనవరాలు వృద్ధుల మందు తరచు గొడవలు పడకూడదు.
5. వృద్ధులు కోరుకునే సమయాన్ని సరదాగా మాత్రమే వారితో గడపాలి.
6. వృద్ధులు ఏం చెప్పినా మన మంచి కోరి చేస్తారు అనేటువంటి విషయాన్ని ప్రతిసారి మనం అర్థం చేసుకొని నడుచుకోవాలి.

రచన
ఏ. బాల సౌజన్యకుమారి,
తెలుగు ఆచార్యులు,
నంది అవార్డు గ్రహీత,
ఆధ్యాత్మికవేత్త,
ప్రవచనకర్త.




# వడ్డీ పెంపు అంచనాల మధ్య ఆర్‌బీఐ సమావేశం

**(సి.హెచ్.ప్రతాప్)**




భారత రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన సమీక్షపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. రాయిటర్స్ సర్వేలో పాల్గొన్న 61 మంది ఆర్థికవేత్తల్లో 35 మంది, అక్టోబర్ 7న రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి తీసుకెళ్లవచ్చని అంచనా వేశారు. ఆగస్టులో వినియోగదారుల ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరి, ఆర్‌బీఐ మధ్యకాలిక లక్ష్యమైన 4 శాతాన్ని వరుసగా మూడో నెల అధిగమించింది. అదే సమయంలో ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. వడ్డీ పెంపు జరిగితే అది 2023 ఫిబ్రవరి తర్వాత తొలి పెంపు అవుతుంది. గృహ, వాహన, వ్యాపార రుణాల వ్యయం పెరిగే అవకాశముండటంతో నిర్ణయం కీలకంగా మారింది.

### మార్కెట్‌కు ఊరట ఇచ్చిన దేశీయ కొనుగోళ్లు

భారత స్టాక్ మార్కెట్ అక్టోబర్ 6న పుంజుకుంది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి సెన్సెక్స్ 533.95 పాయింట్లు, అంటే 0.74 శాతం పెరిగి 72,916.42 వద్ద ట్రేడవగా, నిఫ్టీ 154.70 పాయింట్లు లేదా 0.69 శాతం లాభంతో 22,710.45కు చేరింది. ప్రైవేట్ బ్యాంకులు, మెటల్, చమురు-గ్యాస్ షేర్లు ర్యాలీకి మద్దతిచ్చాయి. అక్టోబర్ 5న విదేశీ సంస్థాగత మదుపరులు రూ.4,699.14 కోట్ల విలువైన షేర్లు విక్రయించగా, దేశీయ సంస్థాగత మదుపరులు రూ.5,181.62 కోట్ల కొనుగోళ్లు జరిపారు. అయితే సెప్టెంబర్ డెరివేటివ్ సిరీస్‌లో నిఫ్టీ 6.7 శాతం క్షీణించిన నేపథ్యంలో, తాజా రికవరీ నిలకడపై అప్రమత్తత అవసరమని మార్కెట్ సంకేతాలు సూచిస్తున్నాయి.

### జియో ఐపీఓకు రూ.11 లక్షల కోట్ల విలువ లక్ష్యం

జియో ప్లాట్‌ఫార్మ్స్ ప్రతిపాదిత ఐపీఓ భారత మూలధన మార్కెట్‌లో ప్రధాన చర్చగా మారింది. అక్టోబర్ 6న వెలువడిన తాజా నివేదిక ప్రకారం, సంస్థ సుమారు రూ.11 లక్షల కోట్ల లేదా 114 బిలియన్ డాలర్ల విలువను లక్ష్యంగా పెట్టుకుని సంభావ్య పెట్టుబడిదారులతో సమావేశాలకు సిద్ధమవుతోంది. ఐపీఓను అక్టోబర్ 19 వారంలో ప్రారంభించి, అక్టోబర్ 30లోగా లిస్టింగ్ పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ, తేదీలు, ధర, విలువ మారవచ్చని నివేదిక స్పష్టం చేసింది. సంస్థ జూన్‌లో దాఖలు చేసిన ముసాయిదా పత్రాల్లో 27 కోట్ల కొత్త షేర్లు, అంటే ఐపీఓ అనంతర ఈక్విటీలో సుమారు 2.9 శాతం జారీ ప్రతిపాదించింది. అయితే విలువపై విభిన్న నివేదికలు ఉన్నందున అధికారిక తుది పత్రాలే నిర్ణాయకం.

### క్విక్ కామర్స్ దెబ్బకు రిటైల్ రంగంలో కొత్త పోటీ

భారత క్విక్ కామర్స్ రంగం వేగంగా విస్తరిస్తుండటంతో సంప్రదాయ రిటైల్ సంస్థలపై ఒత్తిడి పెరుగుతోంది. తాజా వ్యాపార సమాచారంలో అవెన్యూ సూపర్‌మార్ట్స్ స్వతంత్ర ఆదాయం 18.4 శాతం పెరిగినప్పటికీ, మెట్రో నగరాల్లో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి వేదికల పోటీ కారణంగా సమాన దుకాణ విక్రయాల వృద్ధిపై ఒత్తిడి ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డీమార్ట్ షేరు 6.7 శాతం తగ్గినట్లు నివేదిక తెలిపింది. మరోవైపు వినియోగదారుల ఇంటర్నెట్, క్విక్ కామర్స్ సంస్థలు రెండో త్రైమాసికంలో ఆదాయ వృద్ధిని నమోదు చేసే దిశగా ఉన్నప్పటికీ, డెలివరీ మౌలిక వసతులు, డిస్కౌంట్లపై భారీ వ్యయం కారణంగా లాభదాయకత ప్రధాన పరీక్షగా కొనసాగుతోంది. వేగవంతమైన సేవతో పాటు స్థిరమైన వ్యాపార నమూనా నిర్మాణమే ఇక రంగానికి అసలు సవాలు.




# ఆదిలోనే ఆగిన ఆది ఆంధ్రా కాలనీ ఎత్తిపోతల పథకం

## స్థానిక మౌలిక వసతుల అభివృద్ధి కి నిధులు జాప్యం

## సిపిఎం ఈ ప్రాంత అభివృద్ధిపై గ్రామ పర్యటన

**టెక్కలి అక్టోబర్ 6 జయ జయహే**

టెక్కలి మండలం లోని గోపాలపురం, నువ్వు గుడ్డి, ఆంజనేయపురం, చెన్నకేదారి, వెంకటాపురం, ఆది ఆంధ్ర కాలనీ చింతామణి రెవెన్యూ గ్రూపులోని సుమారు 1500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు శంకుస్థాపన కాగా నేటికీ చుక్క నీరు లేక వ్యవసాయ భూములు వీడు భూములుగా మిగిలిపోతున్నాయి, గిరిజన భూములు శాశ్వత వ్యవసాయ అభివృద్ధికోసం 2019 లో ఎత్తిపోతల పథకానికి నేటి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు శంకుస్థాపన శిలాఫలకం వేశారు. ఏడేళ్లు అయినప్పటికీ ఎత్తిపోతల పథకం ఎండమావిగానే మిగిలిపోయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, బృందం ప్రతినిధులు తీవ్రంగా విమర్శించారు. ఆది ఆంధ్ర కాలనీ పరిసర ప్రాంతాలలో అభివృద్ధి పనులు శూన్యంగా ఉన్నాయని మంచినీళ్ల పైపులు, డ్రైనేజీ వ్యవస్థ, వరద ముంపుకు గురవుతున్న ప్రభుత్వ యూ పీ పాఠశాల, రహదారులు, స్థానికుల మంచినీటి అవసరాలు పలు మౌలిక సదుపాయాలను , ప్రభుత్వం వెంటనే తీర్చాలని సిపిఎం, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇక్కడ సమస్యలు పరిష్కారం కాకపోతే మరింత ఆందోళనలు ఉధృతంగా చేపడతామన్నారు, ఈ పర్యటన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు, కన్వీనర్ కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, పాలవలస ధర్మారావు, ఉర్జాన లక్ష్మణరావు, టి వైకుంఠ రావు, సంకిలి దాలయ్య చంద్రరావు, కృష్ణ, స్థానికులు, పాల్గొన్నారు.

# మా గ్రామానికి మంచి నీళ్లు ఇవ్వండయ్యా...!

### డిప్యూటీ సీఎం పవన్‌ను వేడుకుంటున్న అంట్లపాలెం ప్రజలు

### వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన నిర్వహించిన దళిత గిరిజన మహిళలు.

### మాది ఫ్లోరైడ్ గ్రామం... నేటికీ మాకు మంచి నీళ్లు ఇవ్వరు.





**రోలుగుంట, అక్టోబర్ 6, జయ జయహే :**

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కే నాయుడుపాలెం పంచాయతీ అంట్లపాలెం ఫ్లోరైడ్ గ్రామంలో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలో 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీటిలో గిరిజనులు. దళితులు 40 కుటుంబాలు ప్రత్యేక కాలనీ ఉంది. ఈ మేరకు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను వేడుకుంటున్నారు. మా గ్రామానికి ఫ్లోరైడ్ నీరు కాదు మాకు మంచి నీళ్లు ఇవ్వండి.. అంటూ దళిత, గిరిజనులు కోరుకుంటున్నారు. ఆ గ్రామ వాసులు రాసిన సారాంశం ఇలా ఉంది. గతంలో కరెంట్ లేనప్పుడు. మా గ్రామంలో ఒక బోరు ఉండేది. ఇది ఫ్లోరైడ్ వాటర్. ఈ నీటినే ఉపయోగించుకొని మంచినీళ్లు తాగే వాళ్లం...అయితే కాల క్రమంలో ఈ చేతిపంపు పాడైపోయింది. ఇతరుల వద్ద మంచినీళ్లు అడుక్కునే పరిస్థితి. జల జీవన్ మిషన్ పథకం ద్వారా గత మూడేళ్ల క్రితం ప్రత్యేక 20 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకును 22 లక్షల రూపాయలతో ప్రభుత్వం నిర్మించింది. ఈ వాటర్ ట్యాంక్‌కి జానకి రాంపురం నుండి వచ్చిన వరాహ నది నుండి నీరు సరఫరా చేసి, ఈ వాటర్ ట్యాంక్‌కు ఎక్కిస్తే మాకు మంచినీళు నిరంతరం వస్తాయి. ఈ పని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఫ్లోరైడ్ నీరే తాగుతున్నాము. దీనివల్ల కీళ్ల నొప్పులు. అనేక వ్యాధులకి గురై ఇబ్బందులు పడుతున్నాము. ఇప్పటికైనా అధికారులు స్పందించి. వరాది నది నుంచి వచ్చే నీళ్లు మా ఎస్సీ ఎస్టీ కాలనీకి సరఫరా చేయాలి. మేము కరెంటు లేనప్పుడు వాడుకునేందుకు ప్రత్యేక ఒక బోరు నిర్మాణం చేసి మాకు న్యాయం చేయాలని కోరారు. పిల్లలు. మేము నీళ్లు లేకపోతే మా కూలి పని కూడా మానుకొని నీటి కోసం రెండు కిలోమీటర్ల దూరం వెళు న్నాము. డిప్యూటీ ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మాకు మంచి నీళ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు గిరిజన సంఘం నాయకులు ఈదల శ్రీను. స్థానిక మహిళలు ఎం పద్మ. బి లావా. కోదిరే రమణ తో పాటు స్థానిక గిరిజన సంఘం నాయకులు నూకరాజు రాజబాబు తదితరులు పాల్గొన్నారు



## శిథిలావస్థలో పశువైద్యశాలలు

### బీటలవారిన భవనాలలో బిక్కుబిక్కుమంటున్న సిబ్బంది

**దేవరాపల్లి, అక్టోబర్ 6, జయ జయహే**

మండలంలోని ఐదు పశువైద్యశాలల్లో మౌలిక వసతులు లేక, పాత భవనాల్లో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. దేవరాపల్లిలో రెండు దశాబ్దాల కిందట భవనం నిర్మిం చాక నిర్వహణ పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. తలుపులు, కిటికీలు విరిగిపో యాయి. విద్యుత్తు వైర్లు వేలాడుతున్నాయి. ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం లేదు. మామిడిపల్లిలోని భవనానికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కొత్తపెంటలో భవనం అధ్వానంగా ఉ ండగా ఎం. అలమండలో పశువైద్యశాల బీటలు వారింది. వేచలం పశు వైద్యశాలకు సొంత భవనం లేక అరకొర వసతుల మధ్య ఇబ్బందులు పడాల్సి వస్తోందని పశు వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరాపల్లి భవనం దుస్థితిని ఉ న్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, మిగతా భవనాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని. దేవరాపల్లి పశువైద్యాధికారిణి జి.గాయత్రీ దేవి తెలిపారు.



## శిథిల పాఠశాలలపై విద్యాశాఖ దృష్టి

### 11 పాఠశాలల్లో 19 తరగతి గదుల తొలగింపునకు చర్యలు

### డిఈఓ జి జి ఎస్ నాగేశ్వరరావు

**దేవరాపల్లి, అక్టోబర్ 6, జయ జయహే :**

మండలంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల తొలగింపునకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కాశీపురం జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి జి.జి. ఎస్. నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. మండలంలోని 11 పాఠశాలల్లో మొత్తం 19 శిథిల తరగతి గదులను తొలగించనున్నారు. చినగంగవరం, శ్రీరామపురం, నేరేళ్లపూడి, కాశీపురం, బోయిలకింతాడ, నాగయ్యపేట, కె.ఎం.పాలెం, శంబువానిపాలెం, అచ్చియ్యపాలెం, మారేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో 13 గదులు, కాశీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 6 గదులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ శిథిల భవనాలను తొలగించే ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈవో వి.వి. ఈశ్వరరావు ఉన్నారు.



## పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పనిచేయాలి

### టీడీపీ సీనియర్ నాయకులు కరుణాకర్ నాయుడు

**దేవరాపల్లి, అక్టోబర్ 6, జయ జయహే**

రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని బలోపేతం చేయడానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని టిడిపి సీనియర్ నాయకులు ఎల్లేటి కరుణాకరరావు (మహేశ్వరి) నాయుడు అన్నారు. మంగళవారం మహేశ్వరి నాయుడు స్వగృహం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు గొర్లె దేవుళ్ళు, సత్తిబాబు మాస్టారు, కొరుప్రోలు చందర్రావు, రొంగలి గోవిందమ్మ, జానా దేవుడమ్మ, చెంబూరి మురళీకృష్ణ ( బాబ్జి ), తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్ చట్టం చేయాలి

### బీఎస్పీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు శెట్టి లక్ష్మీనారాయణ డిమాండ్

**అరకులోయ, అక్టోబర్ 06: జయ జయహే.**




బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్ కల్పించేలా ప్రత్యేక చట్టం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అల్లూరి జిల్లా అధ్యక్షుడు శెట్టి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. అరకు లోయ నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ బీసీలకు సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో న్యాయం జరిగేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని గతంలో జారీ చేసిన జీవోపై న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకున్న నేపథ్యంలో, ఇకపై స్పష్టమైన చట్టపరమైన రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లక్ష్మీనారాయణ అన్నారు. బీసీల హక్కులకు శాశ్వత భరోసా కల్పించాలంటే రాజ్యాంగ పరిరక్షణ అవసరమని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 29వ షెడ్యూల్‌లో చేర్చి రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లపై సమగ్రంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందని శెట్టి లక్ష్మీనారాయణ తెలిపారు.



## 7న సీఐఐ రీజనల్ సమ్మిట్

### ఏర్పాట్లను పరిశీలించిన జేసీ విద్యాధరి

**విశాఖపట్నం, అక్టోబర్ 5, జయ జయహే**

ఈ నెల 7న గంభీరం ఐఐఎంలో నిర్వహించనున్న సీఐఐ రీజనల్ సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమ్మిట్ నిర్వహించే ప్రధాన సమావేశ మందిరం, ఇతర సమావేశాల కోసం ఏర్పాటు చేస్తున్న సెషన్ హాళ్లు, ఎగ్జిబిషన్ ప్రాంగణం, ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌తో పాటు ప్రతినిధుల రాకపోకలు, పార్కింగ్, రిజిస్ట్రేషన్, వేదిక, సీటింగ్ తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధాన సమావేశం నిర్వహణలో సమన్వయం అత్యంత కీలకమని, వివిధ విభాగాల అధికారులు, ఈవెంట్ ఏజెన్సీ ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అంశానికి సంబంధించి బాధ్యతలు స్పష్టంగా కేటాయించుకొని, అప్పగించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేయనున్న స్టాళ్లు, ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో ప్రదర్శించనున్న అంశాలు ఆకర్షణీయంగా, సమగ్ర సమాచారాన్ని అందించేలా ఉండాలన్నారు. సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు, ఈవెంట్ ఏజెన్సీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.



## నిత్యాన్నదానము పథకమునకు విరాళం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 06, జయ జయహే**

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయవాడ వాస్తవ్యులు పునుకొల్లు ఫణేశ్వర బాబుఒక లక్ష పదహారు వేల ఒక రూపాయి విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థానం ఈఓ బీకే వెంకటేశులు, దేవస్థానం చైర్మన్ కొట్టే సాయిప్రసాద్‌లకు పునుకొల్లు ఫణేశ్వర బాబు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.భక్తుల సహకారంతో దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. ధార్మిక కార్యక్రమాలకు దాతలు, భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు.



## ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

### సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 06, జయ జయహే**

శ్రీకాళహస్తి ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ అనుబంధ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశా కార్యకర్తల సమస్యలను ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించడంతో పాటు, అన్ని రకాల సెలవులు, ప్రసూతి సెలవులు, ఇతర సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.అర్హత, శిక్షణ కలిగిన ఆశా కార్యకర్తలకు ఆరోగ్యశాఖలోని ఖాళీ పోస్టుల్లో అవకాశం కల్పించాలని, పదవీ విరమణ సమయంలో ఆర్థిక ప్రయోజనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో మరణించిన ఆశా కార్యకర్తల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని కోరారు.అలాగే ఆశా కార్యకర్తలపై పనిభారం తగ్గించి, విధి నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రక్షణ పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు గంధం మణి, నాగరాజు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో పోలవరం విద్యార్థుల ప్రతిభ

### ప్రశంసించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులు

**టెక్కలి అక్టోబర్ 6 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువులతోపాటు స్వీయ రక్షణ యుద్ధ క్రీడల్లో ప్రతిభను కనబరచడం చాలా ఆనందదాయకమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రశంసించారు. తమ పాఠశాల విద్యార్థులు సాధారణ క్రీడలతో పాటు యుద్ధ క్రీడల్లో ప్రావీణ్యం సాధించడం హర్షదాయకమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విలియమ్స్ తెలిపారు, ఇటీవల జరిగిన రగ్బీ క్రీడల్లో దినేష్, భువనేశ్వరి ఎంపికయ్యారని, మార్షల్ ఆర్ట్స్ జూడో బాలుర విభాగంలో ఐసాక్, తేజేశ్వరరావు, శ్రీకాంత్, దిలీప్, షణ్ముఖ, బాలికల్లో మాధవి, జ్ఞానేశ్వరి, తమ ప్రతిభ చాటగా త్వైకండో క్రీడలో రోషిత, మీనాక్షి ఎంపికయ్యారు, బాక్సింగ్ క్రీడలో కీర్తి ప్రియ, విజేతగా నిలిచారని వ్యాయామ ఉపాధ్యాయులు జగదీశ్వరరావు , ఆదిశేషులు,తెలిపారు, సాధారణ క్రీడలతో పాటు యుద్ధ క్రీడల్లో జిల్లాస్థాయిలో ప్రావీణ్యం సాధించడం చాలా హర్షదాయకమని ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు, సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.



## బొమ్మలకొలువుకు దేవతామూర్తుల విరాళం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 06, జయ జయహే**

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానంలో దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించనున్న బొమ్మలకొలువు కార్యక్రమానికి దేవస్థాన డోలు విద్వాంసులు మల్లికార్జున్ పలు రకాల దేవీదేవతామూర్తులను విరాళంగా సమర్పించారు.దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయంలో బొమ్మలకొలువును భక్తులను ఆకట్టుకునేలా సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మల్లికార్జున్ దేవతామూర్తులను విరాళంగా అందజేయడం పట్ల అధికారులు అభినందించారు.ఈ సందర్భంగా దేవతామూర్తులను దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు, బోర్డు సభ్యులు గురప్ప శెట్టి, ఆలయ అధికారులు స్వీకరించారు. బొమ్మలకొలువు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పారిశ్రామిక అభివృద్ధితో ఉద్దానం అద్దోనమా

## సకల రోగాలతో ఈ ప్రాంతం సత మతం... ఉప్పు తంపర పచ్చని తోటలకు పొంచి ఉన్న ముప్పు

## స్థానికులకు ఇక్కడ అభివృద్ధి అందని ద్రాక్షే

**టెక్కలి అక్టోబర్ 6 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా తీర ప్రాంతంలోని భాగమైన ఉద్దానం పలాస, వజ్రపు కొత్తూరు, సోంపేట, ఇచ్చాపురం, మందస, మండలాలతో పాటు వీటిని ఆనుకొని ఉన్న నందిగాంశీ, టెక్కలి, సంత బొమ్మాలి, కోటబొమ్మాలి, మండలాల సరిహద్దులు, ఉద్దానం నివాసులతో బంధాలు బాంధవ్యాలు కలిగి ఉన్న ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ప్రశాంత వాతావరణంలో పచ్చని కొబ్బరి ,జీడిమామిడి ,పైరు పంటలతో ఇక్కడ ప్రజలు నివసిస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి కార్గో ఎయిర్పోర్ట్, అల్యూమినియం కర్మాగారం పేరుతో సుమారు 6 వేల 800 ఎకరాల భూముల పై ప్రభుత్వాలు అంచనాలు , ప్రతిపాదనలు జరగడంతో ఉద్దానం నివాసుల్లో గుబులు రేగుతుంది, ఒకవైపు పర్యావరణం పచ్చని తోటలు, ఉప్పు భూములు, తీర ప్రాంత తంపర భూముల తో వ్యవసాయ భూములు అన్యాక్రాంతమై రైతుల చేతులు వదులుతాయని ఆవేదన ఆందోళనలో ఈ ప్రాంత ప్రజలు సకల రోగాలతో సతమతమవుతున్నారు. పలాస ప్రాంతంలో ఇప్పటికే కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదనలతో తాత ముత్తాతల భూములు చేజారి పోతాయని ఆందోళనలో ఉండగా అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రతిపాదన ముల్గే నక్కపై తాటి పండు పడినట్లుందనీ ఇక్కడ గ్రామస్తులు వాపోతున్నారు. స్థానిక వాసులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయంటే అభివృద్ధి అందరిని ద్రాక్షగా ఉండి ఇతరులకు మాత్రమే అవకాశాలు కలుగుతున్నాయి, ఈ ప్రాంత వాసులకు మొండి చేయి మిగులుతుందనీ పలువురి వాదనలు వినిపిస్తున్నాయి. ఇక అల్యూమినియం స్మెల్టర్



ప్రతిపాదనలు ఈ ప్రాంతంలోని పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతుందనే ఆలోచనలో ప్రజలతో పాటు పర్యావరణ పరిరక్షణ హితవరులు వాపోతున్నారు, సిక్కోలు ఉద్దానం, సముద్ర తీర ప్రాంతం, మైదాన పంట భూములకు, గ్రామ వాసులకు ఎలాంటి



తీవ్ర పరిణామాలు, నష్టం కలగకుండా జీవరాశుల మనుగడకు ముప్పు లేని అభివృద్ధిని కేంద్ర రాష్ట్ర పాలకులు ప్రతిపాదనలు చేయాలని సిక్కోలు వాసులు ఆశిస్తూ సమగ్రమైన అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నారు.



## ఏం కోడూరులో సేవా సంకల్ప అభియాన్

**మాడుగుల అక్టోబర్ 6 జయ జయహే**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధికారం చేపట్టి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా బిజెపి నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మాడుగుల మండలం ఎం కోడూరు అంగన్వాడి కేంద్రంలో మంగళవారం సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో అమలు చేస్తున్న పథకాల గురించి పిల్లలకి అందుతున్న తీరు వంటి వాటి గురించి చర్చించారు. అనంతరం అంగన్వాడి టీచర్లను ఆయాలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీజేపీ అల్లూరి సీతారామ రాజు జిల్లా ఇంచార్జి పుట్టా గంగయ్య పాల్గొనగా,జోనల్ ఇంచార్జి మండల సంతోషి సుబ్బలక్ష్మి ,జిల్లా కార్యదర్శి గొల్లవిల్లి రాజేష్ మండల అధ్యక్షులు మెలిపాక స్వామి ,ఎంపీపీ స్కూల్ చైర్మన్ మిస్కా చిన్నమ్మలు ,బీజేపీ నాయకులు న్యాయవాది శ్రీనాదు ప్రసాద రావు , కోన రామకృష్ణ అద్దేపల్లి కొండలరావు మెదండా అరుణ తదితరులు పాల్గొన్నారు



## నాగయ్యపేటలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**దేవరాపల్లి, అక్టోబర్ 6, జయ జయహే**

మండలంలోని నాగయ్యపేట పంచాయతీలో శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి కృషితో పంచాయతీలో అభివృద్ధి కోసం పల్లె పండుగ 3.0లో 30 లక్షలు మంజూరైనట్లు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కర్రి నాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ కర్రి పుష్ప, దేమ-ళ్ళు తెలిపారు. ఈ మేరకు గ్రామంలో పలు రోడ్ల నిర్మాణానికి మంగళవారం స్థానిక కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. వేచలపు వారి కాలనీ బంగారం గుడి దగ్గర నుంచి చొక్కాకుల వారి కల్లాల వరకు, సీతంపేటలో సిసి రోడ్డు నుంచి సిరికి సీతయ్య ఇంటి వరకు సిసి రోడ్లు నిర్మించనున్నారు. పంచాయతీలో మరింత మెరుగైన అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా నిధులు మంజూరుకు అన్ని విధాలుగా సహకరించిన మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు వేచలపు శ్రీరామ్, అప్పల నాయుడు, కార్యదర్శి కర్రి ఎర్రినాయుడు, మాజీ వార్డు సభ్యులు కొట్టాడ రవి, కొమ్మినేని కృష్ణ, గొర్లి మహాలక్ష్మి నాయుడు, తూర్పాటి బంగారయ్య, సింగంపల్లి దేముడు బాబు, గొర్లి వెంటరావు, జామి నాయుడు, ఆదిరెడ్డి నాయుడు, జామి అక్కూనాయుడు, కాగిత మరల నాయుడు, ఆదిరెడ్డి వెంకటరావు, బత్తి రాంబాబు, కర్రి పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర ధరలు తగ్గించాలి




**అనకాపల్లి జయ జయహే**

నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని అనకాపల్లి ఐద్వా సంఘ సభ్యులు మంగళవారం డిమాండ్ చేస్తూ ప్రజల వద్ద నుంచి సంతకాల సేకరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డిడి వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో బియ్యం పప్పులు వంట నూనెలు ఉల్లిపాయలు టమాటాలు కూరగాయలు ఇలా తదితర నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని వీటికి తోడు వంట గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అదుపు చేయలేని విధంగా పెరిగిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు రేషన్ డిపో ద్వారా సుమారు 14 రకాల నిత్యవసర వస్తువులు అందిస్తామని ప్రకటన చేసే అవి ఇంకా అమలులోకి రాలేదని వారు పేర్కొన్నారు నిత్యవసర వస్తువులు ధరలు తక్షణమే తగ్గించాలని రేషన్ దుకాణం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన 14 రకాల నిత్యవసర వస్తువును తక్షణమే సామాన్యుడికి అందుబాటులో ఉంచాలని రైతు బజార్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కూరగాయలు తక్కువ రేటుకు అందించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఐద్వా మహిళా సభ్యులు భారీ ఊరేగింపు నిర్వహించారు ఐద్వా సభ్యురాలు కెవిఎస్ సూర్యప్రభ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

**తొట్టంబేడు, అక్టోబర్ 06, జయ జయహే**

తొట్టంబేడు మండలంలోని పిల్లమేడు గ్రామంలో బీజేపీ మండల కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెడాం కిష్టయ్య, నాయకులు గురవయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని మండల ఇన్‌చార్జ్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.వి. అమర్‌నాథ్ పర్యవేక్షించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు మెళగారం సుబ్రహ్మణ్యం రెడ్డి హాజరయ్యారు. నెలవారీ సంస్థాగత సమీక్షలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో సంస్థాగత నిర్మాణం, రాబోయే పంచాయతీ ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్



మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పుల్లయ్య నాయుడు, గురవయ్య, మండల ప్రధాన కార్యదర్శులు కుమార్, బాలాజీ, సురేష్, శేఖర్ నాయుడు, పవన్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, శివ, అంకయ్యతో పాటు మండల, గ్రామస్థాయి నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమ్మెదలో ఆర్ ఓ వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన

**దేవరాపల్లి, అక్టోబర్ 6, జయ జయహే**

మండలంలోని చింతలపూడి పంచాయతీ పరిధిలోని సమ్మెద గ్రామంలో త్రాగునీటి సరఫరా కోసం నూతన ఆర్.ఓ వాటర్ ప్లాంట్ మంజూరైంది. ఈ ప్లాంట్ నిర్మాణానికి చింతలపూడి టీడీపీ ప్రధాన కార్యదర్శి కొమ్ము శివ ఆధ్వర్యంలో మంగళవారం శంకుస్థాపన చేశారు. సమ్మెద గ్రామ ప్రజల త్రాగునీటి కష్టాలను తీర్చడమే లక్ష్యంగా పెద్ద మనసుతో నిధులు కేటాయించిన ఎంపీ సీఎం రమేష్ కి, ఈ ప్రాజెక్టును నిరంతరం పర్యవేక్షించి వేగంగా ముందుకు నడిపించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి, మాజీ ఎం పీపీ కిలపర్తి భాస్కరరావుకి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి నాయకత్వం బలోపేతానికి మరింత కృషి చేస్తామని శివ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మెద గ్రామ ప్రజలు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దేరు కాలువలో పడి వ్యక్తి మృతి

**మాడుగుల, అక్టోబర్ 6,జయ జయ హే**

మాడుగుల మండలం డి గొట్టివాడ గ్రామానికి చెందిన అదిన అప్పారావు (73) అనే వ్యక్తి గొట్టివాడ గ్రామ శివార్లలో ఉన్న పెద్దేరు కాలువలో మంగళవారం సాయంత్రం శవమై తేలాడు. ఈ విషయాన్ని పోలీసులు తెలిపారు. మృతునికి కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో పాటు, మద్యం బాగా అలవాటు ఉండడం, సుమారు నెల కిందట చేతికి దెబ్బ తగలడం వల్ల జీవితం మీద విరక్తి చెంది శనివారం లేదా ఆదివారం గెడ్డలో పడి చనిపోయి ఉండొచ్చునీ బావిస్తున్నారు. ఈ మేరకు మృతుని అక్క పిచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.





## సీఎం ఆర్పిఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**మాడుగుల అక్టోబర్ ఆరు జయ జయహే**

అని ఆరోగ్య బాధితులకు మంగళవారం మాడుగుల లో బండ సత్యనారాయణ మూర్తి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 2,33,061 రూపాయల చెక్కులను బాధితులకు అందజేసారు. వాటిలో భాగంగా ఎం కోడూరుకు చెందిన గంధం కృష్ణకి 30,795 రూపాయలుఎం కోటపాడు కు చెందినఎసురవరపు అప్పలనరసమ్మకి 24,041 రూపాయలు, పొంగలి పాక కు చెందినలోహితకి 39,001 రూపాయలు, సాగరం కి చెందిన వరుణ కుమార్కి 35,295 రూపాయలను, కేజే పురానికి చెందినపరిమి అప్పారావుకి 31,196 రూపాయలు, ఒమ్మలికి చెందిన బంగారు వరప్రసాద కి 72,734 రూపాయలతో కలసి మొత్తం 2,33,061 రూపాయల చిక్కులను పంపిణీ చేశారు.



## వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ మంత్ర జప పారాయణం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 06, జయ జయహే**

శ్రీకాళహస్తి రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో వరుణ మంత్ర జప పారాయణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాదాయశాఖ ఉత్తర్వుల మేరకు సోమవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా కలశ స్థాపన నిర్వహించి, అనంతరం శ్రీ మహా మృత్యుంజయ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. వేదపండితులు, వేదపారాయణదారులు వరుణ దేవుని అనుగ్రహం కోసం వరుణ మంత్రాలను భక్తిశ్రద్ధలతో జపించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు, బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాలతోనే సమాజ ప్రగతి

## జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

**గుంటూరు (జయ జయహే)**




నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారానే కుటుంబ ప్రగతి, సమాజ అభివృద్ధి సాధ్యమౌతుందని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీన గుంటూరులోని యుటిఎఫ్ హాలులో కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణలో పాల్గొన్న మహిళలకు సర్టిఫికెట్స్ ప్రధాన కార్యక్రమం జరిగింది. సభకు అధ్యక్షత వహించిన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ గత 6 సంవత్సరాలుగా గుంటూరు నగరంలో దాదాపు 6వేల అభాగ్యుల శవాలకు గౌరవ ప్రదమైన అంత్యక్రియలు నిర్వహించడం, నగరంలో వివిధ వేడుకల సందర్భంగా మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద దాదాపు 15 లక్షల భోజనాలు పంపిణీ చేయడం, మహిళా సాధికారతలో భాగంగా ఇప్పటివరకు 5 దఫాలుగా 275 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లపై శిక్షణ ఇవ్వడంతో పాటు గుంటూరు నగరంలో రోడ్డు, రైలు ప్రమాదాలలో మరణించిన అతి పేదలకు దహన సంస్కారాలు చేయడం లాంటి బహుముఖ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. నైపుణ్యాలను పెంపొందించుకున్న మహిళ ఆత్మవిశ్వాసంతో ఆర్థిక స్వాతంత్రాన్ని పొంది కుటుంబానికి ఆసరాగా నిలుస్తుందన్నారు. కుట్టు మిషన్ పై నేడు పొందిన శిక్షణ పునాదిగా భావించి కొత్త డిజైన్స్, కొత్త ఫ్యాషన్స్ లతో ముందుకు పయనించి ఆర్థిక స్వావలంబనను సాధించాలన్నారు. భారతదేశంలో అక్షరాస్యత,నైపుణ్యాలు తక్కువగా ఉండటం వలన మానవాభివృద్ధి సూచికలో 131 వ స్థానంలోనూ, గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లో 38వ స్థానంలో ఉన్నామని,మహిళలు సృజనాత్మకతో నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే భారతదేశం పురోగమి స్తుందన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ గుంటూరు నగరంలోని సేవ తత్పరులందరూ కలిసి సమిష్టిగా ప్రముఖ సేవలను అందిస్తూ మానవత్వానికి మరో పేరుగా నిలిచిన కోవిడ్ ఫైటర్స్ కు తోడ్పాటును అందించాలని కోరారు. నిరంతరం సేవలను అందిస్తున్న కోవిడ్ ఫైటర్స్ కు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గుంటూరులోని రైల్వే ఎకో పార్క్ లో వెయ్యి మొక్కలను నాటి ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కోవిడ్ ఫైటర్స్ స్వీకరించడం ప్రశంసనీయమన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. రామచంద్ర రాజు కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లాబక్షు .ప్రసంగించారు ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ హోప్ విన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డా॥ షమ సుల్తానా, మానవత అధ్యక్షులు పోలూరి వీరారెడ్డి, కార్యవర్గ సభ్యులు మేకల రామారావు, ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమ్మిడి వెంకట రత్నసాగర్, కార్యవర్గ సభ్యులు వల్లూరి సదాశివరావు, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, జవహర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఆస్ర హుస్సేన్, ఆర్.టి.ఐ కార్యకర్త షేక్ బాజీ, అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా చిస్టీ, కోవిడ్ ఫైటర్స్ నేత సయ్యద్ బాబు, సామాజిక ఉద్యమ నేత షేక్ బషీర్ అహ్మద్, మాదిగ జనసేనా సమితి నేత విజయ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ప్రశాంతి నిలయానికి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే

## భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహాసమాధికి భక్తిశ్రద్ధలతో నివాళులు

**పుట్టపర్తి, అక్టోబర్ 6, జయ జయహే:**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మంగళవారం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని తొలిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహాసమాధి వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసి, నివాళులర్పించారు. ప్రశాంతి నిలయానికి చేరుకున్న ఏక్‌నాథ్ షిండేకు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే. రత్నాకర్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన వెంట మహాసమాధి వద్దకు చేరుకున్న షిండే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తరువాత భజన మందిరాన్ని సందర్శించి కొద్దిసేపు ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. సందర్శనకు గుర్తుగా శ్రీ సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఏక్‌నాథ్ షిండేకు ట్రస్ట్ తరఫున అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.జే. రత్నాకర్‌తో మాట్లాడిన షిండే.. ప్రశాంతి నిలయంలోకి అడుగుపెట్టగానే తనకు ఎంతో ప్రశాంతత, మనశ్శాంతి కలిగిందని పేర్కొన్నారు. ఆశ్రమ ప్రాంగణంలో మహారాష్ట్రకు చెందిన సేవాదళ్ సభ్యులు షిండేను



ఆత్మీయంగా పలకరించారు. ప్రస్తుతం మహారాష్ట్రకు చెందిన సుమారు 3,500 మంది సేవాదళ్ సభ్యులు ప్రశాంతి నిలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలుసుకుని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ మానవతా సేవా కార్యక్రమాలను ఏక్‌నాథ్ షిండే అభినందించారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అందించిన ప్రేమ, సేవ, మానవతా సందేశాలను ప్రశంసిస్తూ, ఆయన బోధనలను ఆచరించడం ద్వారా సంతోషకరమైన, అర్థవంతమైన జీవితాన్ని గడపడానికి మార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రశాంతి నిలయంలో నెలకొన్న ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు కొనసాగుతున్న విస్తృతమైన సేవా కార్యక్రమాలను షిండే ప్రశంసించారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దివ్య పాదాల చెంతకు రావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొంటూ, స్వామివారి దివ్య ఆశీస్సులు పొందేందుకు భవిష్యత్తులోనూ ప్రశాంతి నిలయాన్ని సందర్శించాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# సరాళి రోడ్డు, లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

## బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు

**శ్రీకాకుళం.( -జయ జయహే)**

సరాళి రోడ్డు, లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, బిజెపి జిల్ల అధ్యక్షులు సిరిపురం.తేజేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ సరాళి సమస్యల పరిష్కారానికై, పాతపట్నం శాసనసభ్యులు మామిడి.గోవిందరావుని, పాతపట్నం నియోజకవర్గ బిజెపి బిల్ఏ -1 సిరిపురం.త్రివేణి, గ్రామరైతులతో కలిసి సమస్యలను వివరించారన్నారు. సరాళి గ్రామానికి రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని, గ్రామానికి లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ, వినతిపత్రం అందజేశామని, రైతుల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే, సరాళి గ్రామ సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారన్నారు. ఇందులో భాగముగా శ్రీకాకుళం జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేశామని, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు.రామ్మోహన్ నాయుడు కార్యాలయంలో కూడా వినతిపత్రం అందజేసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారన్నారు.



రోడ్డు నిర్మాణపనులు, సగం చేసి ఆపేయడం వలన ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరాళి గ్రామంలో సుమారు 400 ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ తగిన సాగునీటి సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తాగు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు గ్రామానికి లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని, గతంలో గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం అది అందుబాటులో లేకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్కువ వ్యయంతోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరగా, వెంటనే శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారని తేజేశ్వరరావు తెలిపారు.

# రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి




**తిరుపతి, అక్టోబర్ 6, జయ జయహే**

తిరుపతి జిల్లాలో 22-ఏ, వెబ్‌ల్యాండ్, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ, రీ సర్వే తదితర రెవెన్యూ అంశాలకు సంబంధించిన ప్రక్రియలను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సీ.సీ.ఎల్.ఏ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.మంగళవారం ఏపీ సచివాలయం నుంచి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె రెవెన్యూ, భూపరిపాలన అంశాలపై సమీక్షించారు. 22-ఏ, వెబ్‌ల్యాండ్, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ, రీ సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ జిల్లాలో వెబ్‌ల్యాండ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీకి సంబంధించి ఇప్పటికే 38 సైకిల్స్ పూర్తయ్యాయని, మరో 37 సైకిల్స్ పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. మొత్తం 75 సైకిల్స్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే అధికారి రాంప్రసాద్, సెక్షన్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# డి గొట్టివాడలో పొలం పిలుస్తుంది

**మాడుగుల అక్టోబర్ 6 జయ జయహే**

మాడుగుల మండలం డి గొట్టిపాడు గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి అనసూయ ఆధ్వర్యంలో పోరం పిలిచింది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పాల్గొని గ్రామంలో గల రైతుల పొలాలు పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో రైతులకు పలు సూచనలు చేస్తూ రైతులు వారి పొలాలను చదును చేసిన క్రమంలో మట్టిని అడుగు లోతుల కదిలించడం,వేరొక చోట నుంచి కొత్త మట్టిని వేయడం వలన మట్టి భౌతిక పరిస్థితులు మారడం వలన వలన పంటకు అనుకూలంగా లేని పరిస్థితులు ఉన్నవన్నారు.ఎల్ నీనో ప్రభావం వలన మొక్కలు సరిగ్గా పెరగకపోవడం వలన రైతులు పొలంలో జిప్సంను నాట్లు వేసిన 30 రోజుల తర్వాత వెయ్యడం జరిగిందని,జిప్సంను 15-20 రోజులకు వెయ్యాలనీ సూచించారు.వేసిన తరువాత నీటిని పొలంలో పారించాలనీ, కానీ అలా చెయ్యకపోవడం వలన జిప్సం అంతా కూడా ఒక చోట ఉండిపోయి దాని గాఢత ఎక్కువై చౌడు పేరుకుపోయి మొక్కలు కుళ్ళి పోవడం జరిగిందన్నారు. దీని కారణంగా పోటాష్ లోపం కూడా పైరులో గమనించమైనది. కొద్దిపాటి పాము పొడ తెగులు ను గమనించామన్నారు. ఈ సందర్భంగా నివారణ చర్యలు కూడా వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ సరిత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. రాజ్ కుమార్, డాక్టర్ ఎన్. కిషోర్ కుమార్ డాక్టర్ పి బాబు తదితరులు పాల్గొన్నారు.




# ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

**మాడుగుల అక్టోబర్ 6 జయ జయహే**

ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బిఫోర్ కార్యాలయం వద్ద ఆశ కార్యకర్తలు సమస్యలు పరిష్కారానికి నిరసన తెలిపి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయినా కనీసం ఆశ వర్కర్లను పట్టించుకోలేదని వారికి మెటర్నెట్ సెలవులు ఇవ్వాలని, జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆశ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం లో గల మాడుగుల చీడికాడ దేవరపల్లి కే కోటపాడు మండలాలు చెందిన ఆస కార్యకర్తలు పాల్గొని ఆందోళన చేశారు. అలాగే ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె వరలక్ష్మి సిఐటియు వి మాడుగుల నియోజవర్గం కన్వీనర్ ఆర్ దేముడు నాయుడు, సిఐటియు మాడుగుల మండల నాయకులు ఈ నరసింహమూర్తి దేవరపల్లి సిఐటియు నాయకులు దొర, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కే భవాని పి హెచ్ సి కె భవాని రామలక్ష్మి వరలక్ష్మి కామాక్షి దేవి లక్ష్మి రావులమ్మ కొండమ్మ రాజకుమారి సత్య కమల్ కుమారి రామకృష్ణ దేవి తదితరులు పాల్గొన్నారు.



# చోడవరంలో ఘనంగా వరుణ యాగం

**చోడవరం అక్టోబర్ 6 జయ జయహే**

లోక కళ్యాణర్థం వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు పండాలని, ప్రజలంతా క్షేమంగా ఉండాలని కోరుతూ మంగళవారం చోడవరం విఘ్నేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం, వరుణ జపం ఘనంగా జరిగింది. అంతకుముందు స్వామివారికి ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి బృందం ఆధ్వర్యంలో హోమాధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు హాజరై స్వామివారిని దర్శించుకుని హోమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు కాటకాలు ఎదురవకుండా పాడిపంటలు సమృద్ధిగా పండి సకాలంలో వానలు గురించి రాష్ట్రం అభివృద్ధి దశలో ముందుకు సాగాలని ప్రభుత్వా ఆశయమని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంగా శ్రీనివాస్, దేవాదాయ శాఖ కేబి ఆశా కిరణ్ మై, అధికారులు కమిటీ సభ్యులు కూటమి నాయకులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి డీఎస్పీగా బి. పావని

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 06, జయ జయహే**



శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసు అధికారిగా బి. పావని నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న పావనిని శ్రీకాళహస్తిలో ఖాళీగా ఉన్న డీఎస్పీ పోస్టులో తక్షణమే నియమించారు.విజయవాడ ఎన్‌టీఆర్ పోలీసు కమిషనరేట్ దక్షిణ విభాగం ఏసీపీగా ఆమెకు గతంలో ఇచ్చిన పోస్టింగ్‌ను రద్దు చేస్తూ తాజా ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో పావని శ్రీకాళహస్తి డీఎస్పీగా నియమితులయ్యారు.ఇంతకుముందు శ్రీకాళహస్తి డీఎస్పీగా పనిచేసిన నరసింహామూర్తి గూడూరుకు బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో బి. పావనిని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసు అధికారిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

